

యాసంగి పంటకు సాగునీరు

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



కాకతీయ కాలువ నుంచి మీట నొక్కి దిగువకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, అధికారులు, ఎమ్మెల్యే





విద్యార్థినుల కేరింతలు, డీసీసీ కార్యాలయంలో నృత్యాలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు



అల్ఫోర్స్‌లో విద్యార్థినుల నృత్యాలు

న్యూ ఇయర్ జోష్

ఘనంగా నూతన సంవత్సర సంబరాలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 31: కాలచక్రపు పొత్తిళ్లోకి 2023 సంవత్సరం చేరిపోయింది. తీపి, చేదు గుర్తులను మనకు వదిలి మరలి పోయింది. నూతన నోత్తేజాన్ని నింపేందుకు 2024 సంవత్సరం వచ్చింది. గతం, వర్తమాన అంశాలు, అనుభవాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపంలో అందించేందుకు నూతన సంవత్సరం వచ్చింది. డిసెంబరు 31ని చిరకాలం గుర్తుండి పోయేలా ఘనంగా జరుపుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ఎవరి ముఖంలో చూసినా సంతోషం, ఎక్కడ చూసినా హంగామా కనిపించింది. వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా కనిపించగా రాత్రి 12 గంటల సమయంలో వేడుకలు జరుపుకోవడానికి ప్రజలు సంసిద్ధులయ్యారు.

ఉదయం నుంచే జోరుగా అమ్మకాలు

వేడుక అంటే జోష్, ఎంజాయ్. ఆదివారం ఉదయం నుంచి మద్యం, మాంస విక్రయాలు కొనసాగగా షాపుల వద్ద జనం సందడి కనిపించింది. పలు హోటళ్లలో సిద్ధం చేసిన విభిన్న వంటకాలను తెప్పించుకొని రుచులు ఆస్వాదించారు. అర్ధరాత్రి వరకు మద్యం షాపులు, బార్లు, రెస్టారెంట్లు, వేదిక లు సందడిగా కనిపించాయి.

వస్తువులు, కేకులకు భలే గిరాకీ..

నూతన సంవత్సరంలో వాహనాలు కొనుగోళ్లు జరిగాయి. కేకులు, బేకరీల షాపుల వద్ద యువత, విద్యార్థుల సందడి కనిపించింది. శుభాకాంక్షలు తెలుపుకునేందుకు జనం గ్రీటింగ్ కార్డులు, గిఫ్టులు కొనుగోలు చేశారు. వస్త్ర, వ్యాపార సంస్థల వద్ద తమకు నచ్చిన వస్త్రాలు, వస్తువులు కొంటూ కని పించారు. 2024, జనవరి 1కి స్వాగతం చెబుతూ తమ ఇళ్ల లోగిళ్లను రంగులమయం చేసేందుకు రంగులను, వెలుగులు విరజిమ్మేందుకు టపాసులు ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో టపాసులు, రంగుల విక్రయ ప్రదేశాలు జనంతో కిక్కిరిసిపోయాయి. విదేశాల్లో, పలు ప్రాంతాల్లో ఉన్న వారికి శుభాకాంక్షలు తెలిపేందు కు మేసేజ్‌లు పంపుకున్నారు.



ట్రినిటిలో విద్యార్థినుల నృత్యాలు

అల్ఫోర్స్‌లో..

కరీంనగర్ రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో విద్యార్థుల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రినిటిలో...

కరీంనగర్ కల్చరల్: నగరంలోని వావిలాలపల్లి ట్రినిటి ప్రైమ్ క్యాంపస్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడు కలకు ముఖ్య అతిథిగా విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. విద్యార్థులు నృత్యాలు, ఆటా పాటలతో హంగామా చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీసుల బందోబస్తు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం

బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 31: కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని విద్యార్థి భవన్‌లో బీఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో అసంఘటిత రంగ కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని, ఆ కార్మికుల కుటుంబాల అభివృద్ధి, సంక్షేమం కోసం బీఎంఎస్ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, 13 సంవత్సరాలుగా కార్మికులు కనీస వేతన చట్ట సవరణ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికులను గుర్తించి కనీస వేతన సవరణ చట్ట సవరణ చేసి, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్, నాయకులు పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్, గజ్జెల హరికాంత్, నోముల ప్రసాద్, నక్క అరుణ్, అవుదుర్తి రవి, రేణిగుంట శంకర్, ఆకుల తిరుపతి, బూర్ల తిరుపతి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 31: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని యాదవులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల జాతర అంగరంగ వైభవం నిర్వహించారు. సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బోనం తలపై ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మహిళలు బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

మల్యాల: మండలంలోని మల్లెగుట్టపై ఉన్న మల్లన్న ఆలయంలో షష్ఠ ఉత్స వాల్లో భాగంగా ఆదివారం పట్నాలు వేశారు. మల్యాల, పెగడపల్లి, జగిత్యాల తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మల్లెగుట్టపైకి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పొలం వద్దనే రైతు ఆకస్మిక మృతి

రుద్రంగి, డిసెంబరు 31: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు బుచ్చిమల్లయ్య (68)అనే రైతు గుండెపోటుతో పొలం వద్దే ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యుల కళ్లెదుటే ఆకస్మికంగా మృతి చెందాడు. వరి నాట్లు వేసే పనులు చేస్తుండగా గుండెపోటు రావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతునికి భార్య నర్సవ్వ, కొడుకు తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రాజన్నసేవలో హైకోర్టు న్యాయమూర్తి


ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 31: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి వి భాస్కరరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, స్థానిక డీఎస్పీ నాగేం ద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

యాసంగి పంటకు సాగునీరు

- కాకతీయ కాలువ నుంచి విడుదల చేసిన మంత్రి పొన్నం


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, డిసెంబరు 31: యాసంగి పంట సాగుకు ఆదివారం సాయంత్రం కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ మానేరు కింద 8.99లక్షల ఎకరాలకు యాసంగి పంటకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ఎండీలో ప్రస్తుతం సుమారు 19 టీఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. మిడ్ మానేరులో 23 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా రైతులకు యాసంగి పంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకురానుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాల సరఫరా లాంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు తీసుకురానుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, క్యాబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే నీటిని విడుదల చేశామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కూడా ఆదేశించామని తెలిపారు. జిల్లాలోని 16మండలాల్లో ఇప్పటికే 4లక్షలకు పైగా ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలనర్నారు. తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఇప్పటికే మహిళలకు సంబంధించి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి స్పందన ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన 48 గంటల నుంచే ఈ పథకాన్ని ప్రవేశపెట్టాడం జరిగిందని కొనియడారు. డిసెంబరు 9 నుంచి 28వ తేది వరకు 6కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని వివరించారు. ఇంకా ప్రజలకు ప్రయాణాల్లో ఇబ్బంది కలగకుండా ఇప్పటికే నూతనంగా బస్సులను తీసుకురావడం జరిగిందని అన్నారు. విడతల వారిగా 1080నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. అవి కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలుష్య నివరణ కొసం మరో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను మరో రెండు మూడు నెలల్లో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తెలిపారు. అందులో 500 జంటనగరాలకు మరో 500 జిల్లాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో ఉన్న 364 బస్ స్టేషన్‌లు, 97 బస్ డిపోలు, 11రీజియన్‌లను ఏప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.. అంతకు ముందు ఎల్ఎండీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి, ఈఎన్‌సీ శంకర్, ఎస్ఈ శివకుమార్, ఈఈ నాగాభూషణం, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ కనకయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, డిసెంబరు 31: దక్షిణ కాశీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న క్రమంలో ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్ లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తుల సంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ధర్మపురిలో మల్లన్న భక్తుల సందడి


ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 31: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం మల్లన్న భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. షష్టి వారోత్సవాల సందర్భంగా క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని నది వద్దకు చేరుకున్నారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేశారు. నది వద్ద గల స్నానఘట్టాలు, ఇసుక మేటల పైన ప్రత్యేకంగా సైకత లింగాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ టైర్లు చోరీ

జమ్మికుంట రూరల్, డిసెంబరు 31: మండలం శాయంపేటలో గ్రామ పంచాయతీ కార్యాలయం ట్రాక్టర్ టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో ఓ మహిళ మృత్యువాత పడింది. తొమ్మిదో రోజు స్నానాలు చేసేందుకు మంచినీళ్ల ట్యాంక్ కావాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఫోన్ చేశారు. దీంతో సిబ్బంది వాటర్ ట్యాంకర్ పంపించారు. స్నానాలు పూర్తి అయిన అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్యాంకర్ టైర్లు ఎత్తుకెళ్లారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టైర్లు చోరీ చేసిన వాటర్ ట్యాంకర్

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

● ఒకరి మృతి ● వెన్నంపల్లిలో విషాదం
● మరో నలుగురికి గాయాలు


ప్రేమ్‌కుమార్(ఫైల్)

రేగొండ, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సును ఫ్లిప్‌కార్ట్ వ్యాను ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.బస్సు డ్రైవర్, కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొత్తపల్లి గ్రామ శివారు పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండకు బయల్దేరింది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఫ్లిప్‌కార్ట్ కార్గో వ్యాన్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ ఈర్ల ప్రేమ్‌కుమార్ (28) కేబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. కొద్ది సేపు వరకు మృత్యువుతో పోరాడి చివరి శ్వాస విడిచాడు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ బీరబోయిన రమేష్, కండక్టర్ కృష్ణతోపాటు ప్రయాణికులు శ్రీలత, కుమార్‌కు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి పంపారు. మృతుడు ప్రేమ్‌కుమార్ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామస్థుడు. అతడు అవివాహితుడు కాగా తండ్రి బక్కయ్య, సోదరుడు రాజేష్‌తో కలిసి జీవిస్తున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఆర్‌టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్(26) అనే యువకుడు మృతిచెందిన సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. ప్రేమ్ కుమార్ నాలుగేళ్లుగా కరీంనగర్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా రేగొండ మండలంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బక్కయ్య, భాగ్యల రోదనలు మిన్నంటాయి.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 31: కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ జటోత్ సరిలాల్, రెండో ఠాణా సీఐగా వెంకటేష్‌లు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన సీఐల నుంచి కొత్తగా నియామకమైన సీఐలు చార్జి తీసుకుని విధుల్లో చేరారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ



యోగేశ్వరిని అభినందిస్తున్న కోరాజాన్సన్ పాఠశాల డైరెక్టర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 31: రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 67వ ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని కోరాజాన్సన్ విద్యార్థులు ఎంపికయ్యారు. డిసెంబర్ 30న జగిత్యాల జిల్లా గుల్లకోటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల బాలికల విభాగంలో కరీంనగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన కోరాజాన్సన్ విద్యార్థులు యోగేశ్వరి, రాగిణిలు విశేష ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, పీఈటీ దుర్గరాజ్ వారికి పుష్ప గుచ్ఛాలను అందించి అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 31: నగరంలోని భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం పురాణం మహే శ్వర శర్మఆధ్వర్యంలో మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొన్న కాంతారెడ్డి, గురు స్వాములు, దీక్షాపరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 31: నగరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పా టులో భాగంగా సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. 11కేవీ కలెక్టర్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని బస్టాండ్ ప్రాంతం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతం, మార్వాడి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

‘ప్రజాపాలన’లో అవినీతికి తావులేదు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 31: కాంగ్రెస్ ప్రజా పాలనలో ఎక్కడా అవినీతి అక్రమాలకు తావులేదని, పారదర్శక పాలన, ప్రజల అభివృద్ధి ధ్యేయమని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యకర్తల సమక్షంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి ఆనందంతో నృత్యం చేస్తూ పొన్నం, కవ్వంపల్లిలు నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు కోరిన పాలనలో మార్పుకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టామన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల అమలు డిసెంబరు 9 నుంచే 2 గ్యారంటీలు ప్రారంభించామని, తాజాగా 6 గ్యారంటీలలో మిగతా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, సమద్ నవాబ్, రహమత్‌హుస్సేన్, గడ్డం విలాస్‌రెడ్డి, డిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, చెర్ల పద్మ, మల్యాల సుజిత్‌కుమార్, ఎండీ తాజ్, అబ్దుల్ రహమాన్, సిరాజ్‌హుస్సేన్, పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, దన్నాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జర్నలిస్టులకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాం

సుభాష్‌నగర్, డిసెంబరు 31: కాంగ్రెస్ ప్రభుత్వం పాత్రికేయులకు స్వేచ్ఛాయుత వాతా వరణం కల్పిస్తుందని, ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా పాత్రికేయులు విధులను నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) జిల్లాశాఖ అధ్యక్షుడు తాడూరు కరుణాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆయన చెప్పారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో పత్రికల్లో వార్తలు వస్తే చర్యలు ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని, అన్ని సమస్యలు తప్ప కుండా పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఘనంగా సన్మానించింది.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు సాయితేజ ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు31: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈనెల2 నుంచి 5వ తేదీ వరకు జరిగే 67వ జాతీయస్థాయి పాఠశాలల బేస్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరికాలనీ విద్యార్థి సాయితేజ ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఆయన జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అంతటి శంకరయ్య తెలిపారు. సాయితేజను సప్తగిరి కాలనీ ప్రధానోపాధ్యాయులు ముల్కూరి రాజేందర్ పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు.

‘పారమిత’లో నూతన సంవత్సర వేడుకలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 31: నగరంలోని పారమిత విద్యాసంస్థల్లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు శుభాకాంక్షలు తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత

భగత్‌నగర్, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సులో పోయిన ల్యాప్‌టాప్‌ను ఆదివారం ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికునికి అందించారు. కరీంనగర్-1 డిపో బస్సులో జెబిఎస్ నుండి కరీంనగర్ ప్రయాణించిన 70 వేల రూపాయల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను ప్రయాణికుడు మరిచిపోయాడు. బస్సు డ్రైవర్ పి కనకయ్య డిపోలో అందించగా అధికారులు ప్రయాణికుడి వివరాలు తెలుసుకుని ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంటి నజీర్ షేక్, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆసియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు సిరిచందన ఎంపిక



కాంస్య పతకంతో సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 31: హాంకాంగ్ దేశంలో మే నెలలో జరగనున్న ఆసియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన తుడి సిరిచందన ఎంపిక యింది. డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగిన జాతీయ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆమె కాంస్య పతకం సాధించి ఆసియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైందని కరీంనగర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోమటి రెడ్డి పద్మాకర్‌రెడ్డి, భీమనాథుని మల్లేశం తెలిపారు. ఆమె ఫెడరేషన్ కప్‌లో స్క్వాట్ విభాగంలో 135 కిలోలు, బెంచ్‌ప్రెస్ విభాగంలో 75 కిలోలు, డెడ్ లిఫ్ట్ విభాగంలో 125 కిలోల బరువును ఎత్తి తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం అందుకుందన్నారు. సిరిచందనను అసోసియేషన్ ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, బీసీ ఉమెన్స్ హాస్టల్-3 వార్డెన్ శ్రీదేవి, వంశీకృష్ణారావు, రాజమహేందర్ అభినందించారు.

సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

సుభాష్‌నగర్, డిసెంబరు 31: బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ఆసుపత్రిలో అన్నదానం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేషంట్లతో వచ్చే అటెండర్లకు ప్రతి రోజు అల్పా హారం, భోజనం అందచేస్తున్నామన్నారు. ప్రతి శనివారం శనివారం సంత ప్రాంతంలో మధ్యాహ్నం భోజనం అందజేస్తున్నామని తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానం ప్రారంభించి సంవత్సర కాలం పూర్తైన సందర్భంగా శనివారం నిరాశ్రయులైన వారికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో అల్పాహారం, బ్రెడ్ ప్యాకెట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. డెఫ్ అండ్ డమ్ స్కూలుకు రెండు కుట్టు మిషన్లను అందజేశారు. రేకుర్తిలోని వృద్ధాశ్రమానికి రెండు పడక మంచాలను అందజేశారు. బ్రెయిన్ సర్జరీ పేషంట్‌కు చెక్కును అందజేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి రూ. 50,000లు అందజేసినట్లు వారు తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, డిసెంబరు 31: మానకొండూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయ ణ అన్నారు. మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రె స్ పార్టీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొనేందు కు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామ ప్రజలు ఘ న స్వాగతం పలికారు. మొదటగా గ్రామంలోని రామాలయం, పెద్ద మ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ వి గ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇంటింటా తిరుగు తూ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఆయన కృ తజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభు త్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని చెప్పారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. గ్రా మాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలనా సదస్సులను ప్రజలు సద్వినియో గం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, ముద్దసాని శ్రీని వాస్‌రెడ్డి, కొత్తకొండ శంకర్, కనకం అశోక్, రొంటాల లక్ష్మారెడ్డి, రేమి డి శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిగురుమామిడి, డిసెంబరు 31: మండంలోని బొమ్మనపల్లి, సుంద రగిరి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబలను ఆదివా రం మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోలు స్వప్నను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి అంబేద్కర్ చౌరస్తాలో న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని సుందరగిరిలో ప్రియ మిల్క్ పార్లర్‌ను మంత్రి ప్రారంభించారు.

శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్ర

రామడుగు, డిసెంబరు 31: మండలంలోని కొక్కెరకుంటలో అయో ధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధులగుండా శోభాయాత్రగా తీసుకువెళ్లి తిరిగి అక్షతలను రామాలయంలో భద్రపరిచారు. అక్షత లను జనవరి 1 నుంచి 15 వరకు గడప గడపకు పంపిణీ చేయను న్నారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామడుగు ఎస్సైగా రమేశ్

రామడుగు, డిసెంబరు 31: రామడుగు ఎస్సైగా రమేశ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తోట తిరుపతి స్థానంలో రమేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కొత్తగా వచ్చిన ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి సంప్రదించాలని కోరారు.

న్యూ ఇయర్ హంగామా

హుజూరాబాద్, డిసెంబరు 30: గడిచిన ఏడాది మిగిల్చిన అను భవాలను గుర్తు చేసుకుంటూ 2024 సంవత్సరానికి కోటి ఆశలతో ఆదివారం రాత్రి స్వాగతం పలికారు. డివిజన్ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర సంబరాలను జరుపుకున్నారు. కొత్త ఏడాది సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలో బేకరీలు, బిర్యానీ సెంటర్ల ముందు ప్రజలు బారులు తీరారు. బేకరీ, బిర్యానీ సెంటర్ల నిర్వాహ కులు ఆఫర్లు పెట్టడంతో ప్రజలు కొనుగోళ్లకు మక్కువ చూపారు. టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

సైదాపూర్: మండల వ్యాప్తంగా ప్రజలు ఆదివారం రాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. యువత కేక్ కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శభాకాంక్షలు తెలుపుకొన్నారు.

రైతుబంధు డబ్బులు వేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బు లను వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. యాసంగి లో రైతులు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు కేవలం ఒక ఎకరం ఉన్న వారికి మాత్రమే డబ్బులు అందా యని పేర్కొన్నారు. మిగితా రైతులకు కూడా వెంటనే జమ చేయాలని కోరారు. ప్రజా పాలనలో తీసుకుంటున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం

జమ్మికుంట, డిసెంబరు 31: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రా మానికి చెందిన అంబాల ప్రభాకర్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రోలో రాణించి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించా రు. హైమర్ త్రోలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధిం చాడు. ఆబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్ హైమర్ త్రోలో రెండో స్థానంలో నిలిచి రజతం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక, డిసెంబరు 31: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెం దిన ఆర్ఎంపీ జితేందర్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుం బానికి ఆర్ఎంపీ పీఎంపీ అసోసి యేషన్ సభ్యులు 35వ000 నగదు సహాయన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, చెన్నమాధవుని నర్సింహ రాజు, ప్రభాకర్‌రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్, రాజు, రాజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 31: సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్‌రెడ్డి, రాహుల్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి హను మకుమార్, ఫిజికల్ డైరెక్టర్ సిద్దమల్ల విజయ్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. జనవరి 11 నుంచి 14వ తేదీ వరకు గజ్వేల్‌లో నిర్వ హించే పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

రోడ్లపై అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు

హుజూరాబాద్, డిసెంబరు 31: నూతన సంవత్సరం సందర్భంగా తాగి రోడ్లపై అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నూతన సంవత్సరం సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

కమిషనరేట్ వ్యాప్తంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 31 : కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచే పోలీసులు ఆంక్షలు విధించారు. కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జి, మానేరు జలాశయం కట్టపైకి వెళ్లి యువతీ యువకులు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని చూడగా పోలీస్‌కమిషనర్ ఈ రెండు చోట్ల వేడుకలు జరిపేందుకు నిషేధం విధించారు.

గుంపులుగా ఉండటం, ర్యాలీలు వంటివి నిషేధించారు. కేబుల్ బ్రిడ్జి, మానేర్‌డ్యాం కట్ట వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి అటువైపు ఎవరినీ అనుమతించడం లేదు. కమిషనరేట్ వ్యాప్తంగా తనిఖీలు, మొబైల్ పెట్రోలింగ్‌లు నిర్వహిస్తున్నారు. మద్యం షాపులు, బేకరీలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద రాత్రి వరకు రద్దీగా ఉంది. కమిషనరేట్ వ్యాప్తంగా చాలా చోట్ల స్నేహితులు, కాలనీ వాసులు ఫాంహౌజ్‌లు, ఫంక్షన్‌హాళ్లలో మందుపార్టీ, విందులతో వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.